క్లుప్తంగా

భారత షూటింగ్ బాల్ టీమ్ కోచ్‌గా పరశురాముడు



కర్నూలు (టౌన్): వచ్చే నెల 1, 2 తేదీల్లో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ పట్టణంలో నిర్వహించనున్న 1వ ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే భారత పురుషుల జట్టు కోచ్‌గా పరశురాముడు ఎంపికయ్యారు. ఈమేరకు ఏషియన్ షూటింగ్ బాల్ ఫెడరేషన్ కార్యదర్శి జనరల్ రవీంద్రసింగ్ తోమర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పరశురాముడు ఆంధ్రప్రదేశ్ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

పకడ్బందీగా పశు విజ్ఞాన బడులు



విశాఖపట్టణం ష్మైల్ జేడీ డాక్టర్ రమణయ్యకు బొకే అందజేస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పశువిజ్ఞాన బడులను పకడ్బందీగా నిర్వహించాలని వెటర్నరీ అసిస్టెంట్లను విశాఖపట్టణం ష్మైల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు, నాలుగు జోన్‌లకు పశువిజ్ఞాన బడి నోడల్ అధికారిగా ఈయన నియమితులయ్యారు. ఆయన కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పశువిజ్ఞానబడుల నిర్వహణను పరిశీలించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధకశాఖ గోకులం సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఇంట పాడిని అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. జిల్లా జేడీ రామచంద్రయ్య, కర్నూలు డివిజన్ డీడీ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, ఏడీలు భవాని శంకర్‌రెడ్డి, మాధవి, ప్రమీల, పార్థసారథి, నాగరాజు పాల్గొన్నారు.

కేంద్రం రైతు వ్యతిరేక విధానాలు వీడాలి

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వీడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో చేపట్టే ధర్నాకు కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ, నారాయణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు సోమ వారం ఆసుపత్రిలోని పలు వార్డులు తిరిగి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆసుపత్రిలో స్ట్రెచ్చర్, వార్డుబాయ్‌లు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ మిషన్‌ల కొరతతో పాటు టాయిలెట్స్, తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, నారాయణ స్వామి, శరత్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నాటికపై ప్రసంగం

కర్నూలు కల్చరల్: తానా వారు నిర్వహించిన 'తెలుగు సాహిత్య సౌరభం' అన్న ఆన్‌లైన్ కార్యక్రమంలో 'తెలుగు నాటిక'పై కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ రచయిత్రి తెన్నేటి కాశీ విశాలాక్షి సోమవారం ప్రసంగించారు. కళలన్నీ ప్రకృతికి అనుకరణాలని అరిస్టాటిల్ పేర్కొన్నారన్నారు. భరతుడు పది (రూపక) నాటకాల భేదాలను వివరించారన్నారు. ఏకాంకిక రచనకు ప్రాణం సంక్షిప్తత అన్నారు. తెలుగు నాటక రచయితలు ఏకాంకిక, ప్రహసనం, నాటిక మధ్యగల భేదాన్ని తెలిసి వాడటం లేదన్నారు. ఈ మూడు ప్రక్రియలను నాటిక అన్న పదంతోనే వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

అనుసరణీయం..గాంధీమార్గం





గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, అధికారులు, జాతిపిత చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): గాంధీజీ అనుసరించిన సత్యం, అహింసా మార్గం ప్రపంచానికే ఆదర్శమని జేసీ ఎస్. రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆయన చిత్రపటానికి జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గాంధీ సిద్ధాంతాలను గౌరవించి అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, రమ, అనురాధ, సీపీఎ అప్పలకొండ పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఎంసుధాకర్‌బాబు, నాయకులు జాన్ విల్సన్ పెద్దారెడ్డి, బి.క్రాంతినాయుడు, బతుకన్న, పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): ఆర్యవైశ్య మహాసభ నేతలు సోమవారం కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ సమన్వయకర్త ఇల్లూరు లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరు సుధాకర్ మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ వార్డులో గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగేళ్ల రాజగోపాల్, కమలాపురం శేషగిరి శెట్టి, కోశాధికారి వెంకటేష్, నాయకులు ఇల్లూరు రవీంద్రుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక కౌన్సిల్‌హాలులో మహాత్మాగాంధీ చిత్రపటానికి కమిషనర్ భార్గవ్ తేజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమాదేవి, కార్యదర్శి లావణ్య, మున్సిపల్ ఎస్‌ఈ శేషసాయి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కర్నూలు(రాజ్‌విహార్): శాంతి మార్గంలో నడిచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మ గాంధీ అడుగుజాడల్లో నడుద్దామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బిర్లా కాంపౌండ్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో మహాత్ముడి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి పట్టుగొమ్మలు పల్లెలు అని, వాటి అభివృద్ధికి కృషి చేయాలని చెప్పిన మహనీయుడు గాంధీ అన్నారు. ఆయన సూచించిన మార్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడి నడుస్తూ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ విభాగం కార్యదర్శి ధనుంజయ ఆచారి, పార్టీ నాయకులు మోహిన్‌బాషా, యూనుస్‌బాషా, లక్ష్మీ కాంతయ్య, చంద్రకళ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

- ఫైనల్స్ చేరిన కర్నూలు, నెల్లూరు జట్లు



తలపడుతున్న ప్రకాశం, కర్నూలు జట్లు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. బాలుర విభాగం సెమీఫైనల్స్‌లో విశాఖపట్నం జట్టుపై 20–15 స్కోర్‌తో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టుపై 15–10 స్కోర్‌తో కర్నూలు జట్టు గెలిచింది. బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టుపై 15–12 స్కోర్ చేసి కర్నూలు జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి జిల్లా జట్టుపై 5–0 స్కోర్‌తో నెల్లూరు జట్టు సునాయసంగా గెలుపొందింది. మంగళవారం ఫైనల్ పోరు ఉంటుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య వెల్లడించారు. బాలుర విభాగంలో నెల్లూరు, కర్నూలు జట్లు, బాలికల విభాగంలో ప్రకాశం, విశాఖపట్నం జట్లు, మూడు, నాలుగో స్థానాలకు తూర్పుగోదావరి, కృష్ణా జిల్లా జట్లు పోటీ పడతాయని తెలిపారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బస్తిపాడు వంకలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీల మస్టర్లను పరిశీలించారు. పూర్తి వేతనం రూ. 257 పొందేలా ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఈసీ మధుసూదన్‌రావు, టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

కర్నూలు (టౌన్) : తమ కాలనీలో డ్రైనేజీని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని.. పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీరామ నగర్‌కు చెందిన శివప్రసాద్ మునిసిపల్ అధికారులకు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. నగరంలోని పలువురు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. వాటిని నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమాదేవి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ ఎస్‌ఈ శేషసాయి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

అవార్డు వచ్చినందుకు అభినందన సభ



బెస్ట్ కంటింజెంట్ అవార్డు అందుకున్న సిబ్బందితో కమాండెంట్ రవిశంకర్

కర్నూలు: వరుసగా మూడేళ్లుగా బెస్ట్ కంటింజెంట్‌గా నిలిచి జ్ఞాపికలు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని కమాండెంట్ రవిశంకర్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. విజయవాడ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి గణతంత్ర వేడుకల్లో ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంకు బెస్ట్ కంటింజెంట్ అవార్డు దక్కింది. కవాతులో ప్రతిభను చూపి ద్వితీయ స్థానంలో నిలిచినందుకు గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ చేతుల మీదుగా జ్ఞాపికను డీజీపీ చేతుల మీదుగా నగదు రివార్డును పరేడ్ కమాండర్ ప్రసాద్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించి బెస్ట్ కంటింజెంట్ అవార్డును అందుకున్న సిబ్బందిని సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి 11వ బెటాలియన్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండో పటాలం సిబ్బందికి సంకల్పం ఉండటంతో వరుసగా మూడుసార్లు అవార్డును అందుకున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందికి విందు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాసరావు, రవికిరణ్‌తో పాటు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, పటాలం సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

కర్నూలు(హాస్పిటల్): గ్రామాల్లో ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. సోమవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో ఎంఎల్‌హెచ్‌పీల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక ఆరోగ్య అధికారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామస్థాయిలో మెరుగైన సేవ లందించాలన్నారు. గ్రామస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో పాల్గొని సమగ్ర సేవలందించాలని ఆదేశించారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పరిధిలో ప్రజలతో మమేకమై వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలతో కలిసి సామాజిక ఆరోగ్య అధికారులు రోజుకు 20 హెల్త్ ఐడీలు జనరేట్ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశ, ఆరోగ్య కార్యకర్త, సీహెచ్‌ఓలు గర్భిణులను త్వరగా గుర్తించి నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీపీఎంయూ డాక్టర్ ఉమా, డాక్టర్ చంద్రకాంత్ యాదవ్, డాక్టర్ మారుతీప్రసాద్, డాక్టర్ రజని, డాక్టర్ సుష్మిత, డీపీఓ విజయరాజు పాల్గొన్నారు.

ఆపద మిత్రల సేవలు అమోఘం



కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): కరోనా సమయంలో ఆపద మిత్రల (ఆశావర్కర్లు, వలంటీర్లు) సేవలు అమోఘమని జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో ఆశావర్కర్లు, వలంటీర్లకు (ఆపద మిత్రలు) జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలను ఆయన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఊహించని ప్రమాదాలు, విపత్తులు సంభవించిన సమయాల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ఆపద మిత్రలు సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. సీపీఆర్ గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని, 12 రోజుల పాటు వివిధ అంశాలపై తీసుకున్న శిక్షణను పది మందికి వివరిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయ, వలంటీరు వ్యవస్థ దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలోనే శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలకు విపత్కర సమయాల్లో వినియోగించేందుకు ఒక్కొక్కరికి రూ.6,888ల విలువ చేసే కిట్లను అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డీఎల్‌పీఓ తిమ్మక్క, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

కర్నూలు(సెంట్రల్) : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మండలాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలసి సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ఎస్.మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నకు అండగా ఉందాం

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



లబ్ధిదారుడికి సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(న్యూటౌన్): నవరత్న పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 40వ వార్డు సంతోష్ నగర్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. మూడేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యంత్రిగా ఎన్నుకుందామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్లు శేషన్న, ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై మరింత అవగాహన



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ

కర్నూలు(హాస్పిటల్): స్పర్శ కార్యక్రమం ద్వారా కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జేసీ ఎస్. రామసుందర్‌రెడ్డి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్పర్శ కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమ పక్షోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా అన్ని గ్రామపంచాయతీల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో కుష్టువ్యాధిపై గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా లెప్రసి అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉన్నా, చెవులు, ముఖంపై కణితులు ఉన్నా, కాళ్లు, చేతులపై స్పర్శ తగ్గినా, కనురెప్పలు, వెంట్రుకలు రాలినా కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, రమ, అనురాధ, సీపీఓ అప్పలకొండ, హెచ్‌ఈఓ శివశంకర్, డిప్యూటీ హెచ్‌ఈఓ దేవప్రసాద్ పాల్గొన్నారు.

కుష్టురోగులపై ఆదరణ చూపాలి

కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల ఆదరణ చూపాలని డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రరెడ్డి చెప్పారు. సోమవారం నగరంలోని శ్రీరామనగర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో కర్నూలు మెడికల్ కాలేజీ సామాజిక వైద్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్. సింధియా శుభప్రద ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీరామనగర్‌లో ఆశా కార్యకర్తలు, ఆరోగ్యకార్యకర్తలు, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు దివ్య, శ్రీదేవి, బాలకోటయ్య, రాధ, విజయలక్ష్మి, రవినాయక్, రేణుక, పుష్పలత, వెంకటేశ్వర్లు, నాగరాజు, విష్ణుప్రియ, మెర్సి, ఐశ్వర్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులకు జరిమానా

కర్నూలు: కర్నూలు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 30 మంది మైనర్లపై ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.16,050 జరిమానా విధించారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని ముఖ్య కూడళ్లలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్‌విహార్ సెంటర్‌లో ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 30 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని కొత్తపేట దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు అప్పగించమని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు.

అనధికారిక లేఔట్లపై టౌన్ ప్లానింగ్ చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఉన్న మునగాలపాడులో అనధికారిక లేఔట్లపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సోమవారం కొరడా ఝుళిపించారు. అనుమతులు లేని లేఔట్లలో పాతిన రాళ్లను తొలగించారు. అలాగే మామిదాల పాడు వద్ద సర్వే నెంబర్ 4 లో వెలసిన లేఔట్లపై చర్యలు తీసుకున్నారు. బళ్లారి చౌరస్తా సమీపంలో అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేశారు. అమ్మ హాస్పిటల్ వద్ద ఆక్రమణలకు పాల్పడిన భవన, వాణిజ్య భవన నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

స్వయం సమృద్ధి సాధించాలి

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యకర్తలు స్వయం సమృద్ధి సాధించాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి సూచించారు. భగవాన్ శ్రీ బాలసాయిబాబా జన్మదినం సందర్భంగా సాయిబాబా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామారావు ఆధ్వర్యంలో అందజేసిన వివిధ వ్యాపార వస్తువులను వీహెచ్‌పీ నాయకులు ప్రారంభించారు. శివ అనే కార్యకర్తకు అందజేసిన టీ స్టాల్ బండిని సోమవారం బుధవారం పేట మాతా మారెమ్మ ఆలయం ముఖ ద్వారం వద్ద ప్రారంభించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, రాష్ట్ర ధర్మ ప్రసార్ కన్వీనర్ అనంత విశ్వప్రసాద్, బజరంగ్‌దల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ హాజరు నుంచి మినహాయించాలి

కర్నూలు(సెంట్రల్) : ఫీల్డ్‌లో ఉండే పారిశుద్ధ్య కార్మికులకు ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రామాంజనేయులు, రేణుక, కృష్ణ, ఆనంద్, దేవసహాయ, బాబులాల్, యేసన్న, ఆయ్యరాజు, భూషణం, కృష్ణమూర్తి, జమీల్ పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- గడ్డ వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్):మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించినట్లు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన 7వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడ్డ వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. జగనన్న పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలు, ఇబ్బందులు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందని చెప్పారు. గతంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మరిచిపోయే ముఖ్యమంత్రులను చూశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేసి ఆదర్శంగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం పథకాలు పొందాలంటే ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఇంటి వద్దకు వచ్చే వలంటీర్‌కు చెబితే చాలని చెప్పారు. అంతకుముందు గడ్డ వీధికి చెందిన కాళింగి భాగ్యలక్ష్మి ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గత మూడేళ్లలో తమ కుటుంబానికి వైఎస్ఆర్ చేయూత కింద రూ.18,750, జగనన్న చేదోడు రూ.20వేలు, జగనన్న విద్యా దీవెన రూ.5,750, వైఎస్ఆర్ పింఛన్ కానుక కింద రూ.82వేల నగదు అందిందన్నారు. దీంతో పాటు రూ.6లక్షల విలువైన ఇంటి స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా మంజూర్, నాయకులు నవీద్, పర్వేజ్, షోయబ్, అన్వర్, నజీర్, ఖలీల్, ఆరీఫ్, చాంద్, మాలిక్, లతీఫ్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం రాత్రి లేబర్ కాలనీలో అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. నేడు తన పుట్టిన రోజు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచిపెట్టారు.